అంబేద్కర్ వల్లే సకల జనులకు సమన్యాయం

- దేశం అబ్బురపడేలా అంబేద్కర్ మహా విగ్రహం ఆవిష్కరణ
- ముఖ్య అతిథిగా ప్రకాశ్ అంబేద్కర్
- 14న అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై సిఎం సమీక్ష

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న, డా బిఆర్ అంబేద్కర్ మహాశయుడు కనబరిచిన దార్శనికతతోనే దళిత గిరిజన బహుజన వర్గాలతో పాటు సకల జనులందరికీ ఆర్థిక, సామాజిక న్యాయం, అన్ని రంగాల్లో సమాన న్యాయం అమల్లోకి వచ్చిందని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. ఇందుకోసం తన జీవితాన్నే త్యాగం చేసిన ప్రపంచం గర్వించదగ్గ మేధావి డా బిఆర్ అంబేద్కర్ అని కొనియాడారు.

ఏప్రిల్ 14న అంబేద్కర్ పుట్టిన రోజు సందర్భంగా తలపెట్టిన 125 అడుగుల అంబేద్కర్ మహా విగ్రహావిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లు తదితర అంశాలపై సిఎం మంగళవారం ప్రగతిభవన్‌లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబేద్కర్ తన దూరదృష్టితో అనేక చర్చల అనంతరం, ప్రత్యేక రాష్ట్రాల కోసం, ఆర్టికల్ 3 ని రాజ్యాంగంలో ప్రత్యేక శ్రద్ధతో రూపొందించి పొందుపరిచారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సాకారం కావడానికి మార్గం సుగమం చేసిన తెలంగాణ బాంధవుడు, అందరివాడు, డా బిఆర్ అంబేద్కర్.. అని స్పష్టం చేశారు. పక్కనే సచివాలయం, ఎదురుగా తన ఆరాధ్యుడు బుద్ధుని విగ్రహం, మరోదిక్కు త్యాగాలు చేసిన అమర వీరుల స్మారక స్థూపం..వీటి నడుమ శిఖరమంత ఎత్తున నిలిచిన అంబేద్కర్ మహానుభావుడు మనలను నిత్యం చైతన్యపరుస్తూ పాలక వ్యవస్థకు నిత్య స్ఫూర్తివంతమై దారి చూపుతాడన్నారు.

125 అడుగుల డా బిఆర్ అంబేద్కర్ మహా విగ్రహాన్ని, శోభాయమానంగా.. తెలంగాణ సమాజంతో పాటు యావత్ దేశ ప్రజలు సంబురపడేలా గొప్పగా ఆవిష్కరించుకుందామని తెలిపారు. దేశం గర్వించదగ్గ స్థాయిలో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్న సందర్భంలో ఆవిష్కరణ సభ కూడా అంతే ఉన్నత స్థాయిలో,అంబేద్కర్ ఔన్నత్యాన్ని మరింత గొప్పగా ప్రపంచానికి చాటి చెప్పేలా వుండాలని స్పష్టం చేశారు.

అంబేద్కర్ విగ్రహం స్థాపించాలని నిర్ణయం తీసుకున్న నాటినుంచి, కలకాలం నిలిచే విధంగా సాంకేతికంగా, తయారీ పరంగా పకడ్బందీ చర్యలు తీసుకోవడాని కనీసం రెండు సంవత్సరాల సమయం తీసుకుందని గుర్తు చేసుకున్నారు. ఇందుకు పలు దేశాలు ప్రాంతాలు తిరిగి సమాచారాన్ని సేకరించి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతోనే రూపొందించడం తనకు అత్యంత సంతృప్తిని కలిగించిందని తెలిపారు. విగ్రహ రూపశిల్పి 98 ఏళ్ల పద్మభూషణ్, రామ్ వంజీ సుతాం కృషిని సిఎం ప్రశంసించారు. వారిని ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించాలని నిర్ణయించారు.

అత్యున్నత స్థాయిలో వారి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం అంటే వారి అత్యున్నత ఆశయాలను అనుసరించేందుకు నిత్యం స్ఫూర్తి పొందడమే అని సిఎం అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని తగు జాగ్రత్తలతో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రం నలు మూలలనుంచి విగ్రహావిష్కరణ కోసం వచ్చే అతిథులు, ప్రజల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రులకు, ఉన్నతాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, రసమయి బాలకిషన్, బాల్క సుమన్, విఠల్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, సిఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు :

ఏప్రిల్ 14 న జరిగే.. డా బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణను అత్యంత వైభవోపేతంగా, చారిత్రాత్మక వేడుకగా, కన్నుల పండుగగా దేశం గర్వించే రీతిలో జరపాలి.

ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా పూల జల్లు కురిపిస్తూ భారత రత్న, భారత రాజ్యాంగ నిర్మాత తెలంగాణ ప్రదాతకు ఘనమైన రీతిలో పుష్పాంజలి ఘటించాలి.125 అడుగుల డా బిఆర్ అంబేద్కర్ విగ్రహానికున్న భారీ పరదాను తొలగించడానికి,, నిలువెత్తు పూలమాలను అలంకరించడానికి....అతి పెద్ద క్రేన్‌ను ఉపయోగించాలి.

బౌద్ధ భిక్షువులను మాత్రమే ఆహ్వానించి వారి సాంప్రదాయ పద్ధతిలోనే కార్యక్రమాన్ని నిర్వహించాలి.సచివాలయ సిబ్బంది అధికారులతో పాటు..అన్ని శాఖల హెచ్ ఒడిలు, జిల్లా కలెక్టర్లు..రాష్ట్ర మంత్రులు, ఎంపిలు (రాజ్యసభ లోక్ సభ) , ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్లు హాజరుకావాలి.ప్రతి నియోజకవర్గం నుంచి 300 మంది చొప్పున మొత్తం 119 నియోజకవర్గాల నుంచి 35,700 మంది అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి.

ప్రజల తరలింపు కోసం 750 ఆర్‌టిసి బస్సులను బుక్ చేసుకోవాలి.హైద్రాబాద్ చేరుకునేలోపే 50 కిలోమీటర్ల దూరంలోనే సభకు వచ్చిన ప్రజలకు భోజనం ఏర్పాట్లను చూసుకోవాలి. సభానంతరం తిరిగి వెల్లేటప్పుడు కూడా రాత్రి భోజనం ఏర్పాట్లు చూసుకోవాలి.ప్రజల కోసం లక్ష స్వీట్ ప్యాకెట్లు, లక్షన్నర మజ్జిగ ప్యాకెట్లు (విజయ డైరీవారి), లక్షన్నర వాటర్ ప్యాకెట్లు అందుబాటులో వుంచాలి.పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం వున్నందున ప్రజలకు ఎండవేడి తగలకుండా షామియానాలు ఏర్పాటు చేయాలి.ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగు బాధ్యతను హైద్రాబాద్ సిపి తీసుకోవాలి. పార్కింగుకు అనువైన స్థలాన్ని పరిశీలించాలి.

సభ రోజు సామాన్య ప్రయాణీకులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను పోలీస్ యంత్రాంగం చూడాలి. ఈ సందర్భంగా ఘనమైన రీతిలో ఆట పాటలతో సంబురాలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలి. ఇందుకు గిడ్డంగుల శాఖ చైర్మన్, గాయకుడు సాయిచంద్‌తో కలిసి సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ కార్యక్రమాలను రూపొందించాలి.అంబేద్కర్‌కు సంబంధించిన పాటలను మాత్రమే పాడుతూ, ఆ మహనీయునికి తెలంగాణ సాంస్కృ తిక నీరాజనం అర్పించాలి. ఇందుకు సంబంధించిన రిహార్సల్స్ తదితర ముందస్తు సన్నద్ధత బాధ్యత ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే అధికారిక కార్యక్రమం..కాబట్టి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్ని ఏర్పాట్లను స్వయంగా పరిశీలించాలి. ఈ కార్యక్రమానికి డా బిఆర్ అంబేద్కర్ ముని మనుమడు ప్రకాశ్ అంబేద్కర్‌ను ముఖ్య అతిథిని ఆహ్వానించాలని నిర్ణయం. అంబేద్కర్ మహాశయుని ఔన్నత్యాన్ని చాటే విధంగా దేశవ్యాప్తంగా ప్రింటు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు జారీ చేయాలి. ఇందుకు సంబంధించి మంత్రులు హరీష్ రావు, కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్ రెడ్డిలతో కూడిన కమిటీ తగు చర్యలు తీసుకోవాలి. దీంతో పాటు విగ్రహావిష్కరణ, సభకు సంబంధించిన ఏర్పాట్లు కూడా ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ సందర్భంగా సభికులకు అనువుగా ఎల్ ఇడి స్క్రీన్లను ఏర్పాటు చేయాలి. సభికుల కోసం 40 వేల కుర్చీలను ఏర్పాటు చేయాలి.

జస్టిస్ నాగార్జునకు వీడ్కోలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ డి నాగార్జునకు హైకోర్టు మంగళవారం వీడ్కోలు చెప్పింది. మద్రాస్ హైకోర్టుకు జస్టిస్ నాగార్జున బదిలీ అయిన విషయం తెలిసిందే. దీంతో చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అధ్యక్షతన ఆయనకు హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది.

భద్రత పెంపు వినతిపై నిర్ణయం తీసుకోండి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తనకు ఎమ్మెల్యేగా ఉన్నప్పటి 2+2 పోలీసు భద్రత తిరిగి కల్పించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు రాష్ట్ర పోలీసులకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారించారు. మాజీ ఎమ్మెల్యే వినతిపత్రంపై పది రోజుల్లోగా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిజిపి, నిఘా అదనపు డిజిలను ఆదేశించారు.

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE :: CITY CIVIL COURT :: AT :: HYDERABAD
O. S. No.4345 OF 2021

Between :
D.Purna Chandra Rao,
S/o.Late. D.Sambasiva Rao ,
Aged about 49 Years, Occ: Business,
R/o.H.No.7-1-282/C/62, Flat No.301,
R.K. Residency B.K. Guda, Balkampet ,
Hyderabad -38.
.......Plaintiff
AND
Kanuparthi Janaki,W/o.Late K.SivaPrasad,
R/o.H.No.7-1-309/42,B.K.Guda,
S.R.Nagar, Hyderabad ,Telangana State-500038, Prsenatly Residing at
Narsampalem Village ,Near Saibaba
Temple, Movva Post and Mandal,Krishna
District-521135.
......Defendant

Please take notice that the above Plaintiff is filed in O.S.No. 4345 of 2021 for recovery of money against you . If any Objections/Claims from any party may present before the above said Honble court on.10-04-2023 at 10.30 A.M. through an advocate or personal presence . If no claims is filed before the Honble court the matter will be decided as per law.

(BY Order Of the Court)
B.NARASIMHULU,
ADVOCATE
H.No.7-1-309/42,B.K.Guda,
S.R.Nagar, Hyderabad.

చెరుకు సుధాకర్ పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన ప్రాణాలు తీసేస్తానని చెప్పారని, ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు చేసేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని చెరుకు సుధాకర్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారించారు. సుధాకర్ కుమారుడు చెరుకు సుహాన్ సైతం పిటిషన్ వేశారు. నల్లగొండ జిల్లా కోర్టులో కేసు వేయకుండా నేరుగా హైకోర్టులో పిటిషన్ వేయడాన్ని న్యాయమూర్తి తప్పుపట్టి పిటిషన్లను కొట్టేస్తూ తీర్పు చెప్పారు.

మార్గదర్శి కేసు దర్యాప్తులో బలవంతపు చర్యలొద్దు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మార్గదర్శి చిట్‌ఫండ్ లావాదేవీలు చట్ట వ్యతిరేకంగా ఉన్నాయని ఎపి ప్రభుత్వం చేపట్టిన దర్యాప్తును ఆ సంస్థ చైర్మన్ రామోజీరావు, ఎండి శైలజ హైకోర్టులో సవాల్ చేశారు. విచారణ పేరుతో మార్గదర్శి బ్రాంచీలకు చెందిన 30 మంది మేనేజర్లకు ఎపి సిఐడి నోటీసులు ఇవ్వడాన్ని సవాల్ చేశారు. ఈ లంచ్‌మోషన్ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. దర్యాప్తు పేరుతో బ్రాంచి మేనేజర్లపై కఠిన చర్యలు, బలవంతపు చర్యలు తీసుకోరాదని మధ్యంతర ఆదేశాలను జారీ చేశారు. సిఐడి చేస్తున్న దర్యాప్తును కొనసాగించవచ్చునని చెప్పారు. విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు.

కులం పేరుతో తోటి విద్యార్థుల వేధింపులు!

- విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కులం పేరుతో తోటి విద్యార్థినులు వేధించడంతో తట్టుకోలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ నర్సింహ, విద్యార్థిని తండ్రి ప్రభాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పెనుమాల విద్యా ప్రియాంక (18) హయత్‌నగర్‌లోని ధవావో ఇంటర్నేషనల్ మెడికల్ అకాడమీలో నీట్ పరీక్ష కోసం ఆరు నెలలుగా కోచింగ్ తీసుకుంటోంది. ఆమె మరో నలుగురు విద్యార్థినులతో కలిసి హాస్టల్‌లో ఒకే గదిలో ఉండేది. ఈ క్రమంలో ప్రియాంక తక్కువ కులానికి చెందిందని, వారికి డాక్టర్ చదువు అవసరమా అని తోటి విద్యార్థినులు హేళన చేసేవారు. అలాగే, ఆ కులానికి చెందిన వారి వల్లే తమకు ఉద్యోగాలు రావడం లేదనేవారు. దాంతో ఆమె గట్టిగా వారిని నిలదీయడంతో తనతో మాట్లాడటం మానేశారు. ప్రియాంక సోమవారం రాత్రి తన తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పగా.. ధైర్యం చెప్పాడు . అనంతరం ప్రియాంక హాస్టల్ పై అంతస్థు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. తన కుమార్తెను చావుకు ప్రేరేపించే విధంగా చేసిన తోటి విద్యార్థినులపై చర్యలు తీసుకోవాలని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

117 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా కోదాడ మండలపరిధిలోని రామాపురం క్రాస్‌రోడ్ రాష్ట్ర సరిహద్దు వద్ద పోలీసులు 117 కిలోల గంజాయిని మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కోదాడ పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి రాజేంద్రప్రసాద్ వివరాలు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సల్మాన్, అరుణ్ లారీ డ్రైవర్లుగా చేస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి వెళ్లినప్పుడు చిరంజీవి అనే వ్యక్తి ద్వారా గంజాయి రవాణాకు ఒప్పుకున్నారు. ఇద్దరు ఈ నెల మూడున రాజమండ్రిలో చిరంజీవి వద్ద సుమారు రూ.20 లక్షల విలువగల 117.30 కేజీల 63 ప్యాకెట్ల గంజాయిని తీసుకున్నారు. ఇండికా కారు సీటు కింద, కారు వెనుక పెట్టెలో పెట్టుకుని రాజమండ్రి నుంచి ముంబయికి రవాణా చేసేందుకు రూ.12,000కి ఒప్పుకొని బయల్దేరారు. కాగా కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్ వద్ద చెక్‌పోస్ట్ చూసి కారు వదిలి పారిపోతుండగా పోలీసులు వారిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి గంజాయి, ఇండికా కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న పోలీసులను ఎస్‌పి అభినందించారు. అనంతరం రూరల్ సిఐ, ఎస్ఐ, సిబ్బందికి రివార్డులు ప్రకటించారు. ఈ సమావేశంలో డిఎస్‌పి వెంకటేశ్వర్‌రెడ్డి, రూరల్ సిఐ పిఎన్‌డి ప్రసాద్, పట్టణ సిఐ శివశంకర్, రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్, చిలుకూరు ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సిట్ విచారణ

- రెండోసారి జగిత్యాల జిల్లాలో పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీ వ్యవహారంలో సిట్ మరింత దూకుడు పెంచింది. మంగళవారం ఐదు బృందాలుగా ఏర్పడిన సిట్ అధికారులు జగిత్యాల్ జిల్లాలో విచారణ నిర్వహించారు. సిట్ చీఫ్ ఏఆర్ శ్రీనివాస్ నేతృత్వంలోని బృందం టిఎస్‌పిఎస్‌సి కమిషన్ చైర్మెన్ జనార్దన్‌రెడ్డిని సోమవారం ప్రశ్నించిన విషయం తెలిసిందే. కమిషన్ విధి విధానాలు, పేపర్ లీకేజీ అంశాలపై మూడున్నర గంటలపాటు వివరాలు సేకరించారు. ఇప్పటికే ఈ కేసులో 15మందిపై కేసులు నమోదు చేసిన అధికారులు పలువురిని విచారించారు. మంగళవారం చంచల్‌గూడ జైలు నుంచి ప్రశాంత్, రాజేందర్, తిరుపతయ్యను కస్టడీకి తీసుకున్నారు. వారిని విచారించి పలు కీలక సమాచారం సేకరించినట్టు తెలిసింది. ఓ వైపు నిందితులను ప్రశ్నిస్తూనే.. మరోవైపు క్షేత్రస్థాయిలో విచారణ మొదలుపెట్టారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన పలువురిని విచారించినట్టు తెలిసింది. దాదాపు 40మంది ప్రిలిమ్స్‌లో అర్హత సాధించినట్టు గుర్తించిన అధికారులు వారు ఎక్కడెక్కడ కోచింగ్ తీసుకున్నారో ఆరా తీసినట్టు సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజశేఖర్ రెడ్డి స్వగ్రామమైన తాటిపల్లిలో సైతం సిట్ అధికారులు విచారణ నిర్వహించారు. రాజశేఖర్‌రెడ్డితో గ్రూప్-1లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఏమైనా స్నేహం, బంధుత్వం ఉందా అనే కోణంలో విచారించినట్టు తెలిసింది. అర్హత సాధించిన అభ్యర్థుల శక్తిసామర్థ్యాలు, వారి విద్యార్హత వివరాలు సైతం పరిశీలించినట్టు సమాచారం.

In the Court of the Hon'ble Principal Junior Civil Judge: Kadapa
E.P.No. 347 /2016
D.R.K.No.216/2015
Kapil Chits Hyderabad Pvt., Ltd.,
Badvel Branch, represented
by its Zonal Legal
.... Petitioner/D.Hr
Vs
1. V. Krishna S/o Kasaiah, Hindu, working as Driver in A.P.S.R.T.C Vikarabad, D.No.2/40, Janwada, Sankar palli (M), Ranga Reddy (Dist), Now working as Driver, Grade-2 in Vikarabad Bus Depot, Vikarabad.
2. P.V.R. Ravi Kumar, S/o. P. Sharma, Hindu, working as Mechanic in A.P.S.R.T.C Depot, Vikarabad, D.No4-3-208, Mosises School Road, Christain Colony, Vikarabad Dist, Now working as Mechanic, Grade-2 in Vikarabad Bus Depot, Vikarabad.
... Respondents/J. Dr No.3 & 5
NOTICE TO JDR No.3 & 5

పై నెంబర్ లోని పిటిషనర్ కంపెనీ 3 మరియు 5 రెస్పాండెంట్స్ అయిన మీ మీద E.P. మొత్తం రాబట్టు కొనుటకు గాను పై నెంబర్ E.P. ని దాఖలు చేసినందున యిందువిషయమై మీ హాజరు గాను 20-04-2023న తేదీన వాయిద ఉన్నది. అ తేది న ఉదయం 10.30 గంటలకు ఖుద్దునగాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై కోర్టువారితో అక్షేపణలున్న యెడల మనవి చేసుకోవలసినది. లేనియెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని తెలియచేయడమైనది.

// కోర్ట్ వారి ఉత్తర్వు మేరకు //
వాయిదా : 20-04-2023
M. Nagi Reddy
Advocate, Kadapa

ప్రైమ్‌బుక్ 4జికి విశేష స్పందన

న్యూఢిల్లీ : తాము ఆవిష్కరించిన ప్రైమ్‌బుక్ 4జికి అనూహ్య స్పందన లభిస్తుందని ఆండ్రాయిడ్ ఒఎస్ ఆధారిత ల్యాప్‌టాప్ తయారీ బ్రాండ్ ప్రైమ్ బుక్ పేర్కొంది. రూ.20వేల దిగువన విలువ చేసే తమ ల్యాప్ ట్యాప్‌లకు భారీగా ఆర్డర్లు వస్తున్నాయని తెలిపింది. ప్రైమ్ ఒఎస్‌పై నడిచే ప్రైమ్‌బుక్ 4జి ధరను రూ.16,990గా నిర్ణయించగా.. ఫ్లిప్‌కార్ట్‌లో వినియోగదారులకు రూ.14,990కే అందిస్తున్నట్లు పేర్కొంది.

ప్యూర్ ఇవి "హ్యాపీ విత్ ప్యూర్" క్యాంపెయిన్

హైదరాబాద్ : ద్విచక్ర విద్యుత్ వాహనాల తయారీదారు ప్యూర్ ఇవి వినియోగదారులను ఆకర్షించడానికి వినూత్న క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న ఈ సంస్థ ఉగాది, గుడి పడ్వా సందర్భంగా "హ్యాపీ విత్ ప్యూర్" పేరుతో 2023 మే 31 వరకు ప్రచార క్యాంపెయిన్‌ను కొనసాగించనున్నట్లు పేర్కొంది. వినియోగదారులు ఇందులో పాల్గొనడం ద్వారా రూ.5,000 విలువ చేసే గిఫ్ట్ వోచర్‌ను పొందవచ్చని పేర్కొంది. దేశ వ్యాప్తంగా తమ సంస్థకు 130 డీలర్‌షిప్‌లు ఉన్నాయని తెలిపింది. 2023 ముగింపు నాటికి 300 నగరాలకు తమ విక్రయాలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

మహారాజశ్రీ డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ అర్బిట్రేటర్ కర్నూలు
డిస్ప్యూట్ నెంబరు : 246/2021
మెస్సర్స్ శ్రీ రామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కర్నూలు బ్రాంచి. ...డిస్ప్యూటెంట్
వర్సెస్
T.Laxmi Reddy మరియు 4 ఇతరులు. ...ఆపొనెంట్స్
ఆపొనెంట్స్ 1 నుండి 5 గురికి నోటీసులు
1) T.Laxmi reddy, S/o T.C.Thimma reddy, H.No.8-3-231/F/4, S.K.Nagar, Yoosuf guda, Hydrabad.
2) S.Ifthikar Ahammad, S/o S.Shabber Hussain, D.No.215/c Flat No.401, Sri Nilayam, Addagutta, Kukatpalli, Hyderabad.
3) G.Surendra reddy, S/o G.Ranga Reddy, Krishna nagar, V.V.Securities, Madhapur, Hyderabad.
4) G.Rameswari D/o G.Katamaraju, oracle Apps Technical, Consultant, Blue rose, Banglore.
5) K.Raju S/o K.Jayanna D.No.3-30, Paipadu (V), Waddepalli (M), Jogulamaba Gadwal (Dt).
...ఆపొనెంట్స్

డిస్ప్యూట్ బాకీమొత్తం రూ.7,62,496=00 రాబట్టుకొనుటకుగాను మీ పైన దాఖలు చేసి డిస్ప్యూట్‌లో 1 నుండి 5 వ ఆపొనెంట్స్ అయిన మీరు 18-04-2023వ తేది రోజున ఉదయం 11.00 గంటలకు మీరుకాని మీ తరపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
వాయిదా తేది : 18-04-2023
బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటి రిజిస్టర్ ఆఫ్ చిట్స్/ అర్బిట్రేటర్, కర్నూలు.

WE ARE HIRING
Maa Institute of Speech And Hearing (MAA Research foundation) is inviting applications for the following posts.

MAA INSTITUTE OF SPEECH & HEARING
AFFILIATED TO OSMANIA UNIVERSITY & RECOGNIZED BY REHABILITATION COUNCIL OF INDIA
EDUCATE • EMPOWER • ENLIGHTEN

S.No	Designation	Eligibility	Requirement
1	Principal	M.Sc(Sp & Hg) / MASLP/equivalent and Ph.D (in core areas) and 10 years teaching experience at PG/UG level	01
2	Associate Professor	M.Sc(Sp & Hg)/M.ASLP/equivalent with 8 years of teaching experience at graduate/ post graduate level	02
3	Assistant Professor /Audiology	M.Sc(Sp & Hg)/M.ASLP or M.Sc.(Audiology) 2 years teaching / clinical / research experience Pathology	02
4	Assistant Professor/ Speech Pathology	M.Sc(Sp & Hg)/M.ASLP or M.Sc.(Speech Language Pathology) 2 years teaching / clinical / research experience Pathology	02

Kindly sent the resume to **hr@maaent.com** or Call Us **8886689909, 9100072758**
H.No. 8-2-293/82/A/1266, Road No.36, Jubilee Hills, Hyderabad - 500 033.
PH: +91 9100-072-758 | admin@mish.co.in | www.mish.co.in

ప్రధాని పర్యటనపై సిఎస్ సమీక్ష

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ప్రధాని నరేంద్రమోడీ ఈ నెల 8న రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం ఆమె సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. భద్రత, ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు చూడాలని పోలీసు అధికారులను, సరిపడినన్ని అగ్నిమాపక పరికరాలను పర్యటన స్థలంలో అందుబాటులో ఉంటారని అగ్నిమాపక సిబ్బందిని కోరారు. అదే విధంగా వైద్య సిబ్బంది, అంబులెన్స్, ఇతర సౌకర్యాలు ఉండేలా చూడాలని వైద్యారోగ్యశాఖ అధికారులకు సూచించారు. ప్రధాని ఉపయోగించే రోడ్డు మార్గం మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాని పర్యటించే అన్ని చోట్ల విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీజీపీ అంజనీ కుమార్, సీనియర్ పోలీస్, రైల్వే అధికారులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏనాడైనా తెలంగాణ గురించి పార్లమెంటులో మాట్లాడారా?

- బండి సంజయ్‌కు గాదరి కిషోర్ ప్రశ్న

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ సభ్యుడిగా ఏనాడైనా పార్లమెంటులో తెలంగాణ గురించి మాట్లాడారా? అంటూ బిజెపి ఎంపీ బండి సంజయ్‌ను బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని బిఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ విద్యార్హతల గురించి బిజెపి నేతలు పూటకో మాట మాట్లాడుతున్నారని, వాటిలో ఏది నిజమో దేశ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కేంద్రం ఇవ్వాల్సిన వాటి నిధులపై ఢిల్లీలో లాంగ్‌మార్చ్ నిర్వహించాలంటూ సంజయ్‌కు హితవు పలికారు.

భూ వివాదంలో ఘర్షణ

- అధికార పార్టీ నేతలకు గొల్ల కురుమలకు మధ్య కొట్లాట
- వైరల్ అవుతున్న వీడియో
- పోలీస్ స్టేషన్లో ఇరుగ్రూపుల ఫిర్యాదు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అధికార బిఆర్ఎస్ పార్టీ నేతలకు గొల్ల కురుమలకు మధ్య భూ వివాదంలో తీవ్ర ఘర్షణ నెలకొనగా.. కర్రలు, రాళ్లతో దాడిచేసుకున్న ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సంఘటన జనగామ జిల్లా సోలిపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఇరు గ్రూపులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన 56వ సర్వే నెంబర్‌లోని 18 ఎకరాల భూమిని నలభై ఏళ్ల కిందట సాదా బైనామాగా కొనుగోలు చేసి గొర్లను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నామని గొర్రె కాపరులు తెలిపారు. కాగా, ఈ భూమి తమ తాత తండ్రుల నాటిది వంశపారపర్యంగా వస్తుందని గ్రామానికి చెందిన ముద్దసాని గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ భూమిని తాము గొల్ల కురుమలకు అమ్మలేదన్నారు. కొన్నేళ్ల కిందట తరిగొప్పుల గ్రామానికి చెందిన తాళ్లపల్లి పోశయ్యకు ఈ భూమిని అమ్మామని తెలిపారు.

ఈక్రమంలో బిఆర్ఎస్ గ్రామ నాయకులైన ముద్దసాని గోపాల్ రెడ్డి, తాళ్లపల్లి పోశయ్య భూమిలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. వారిని గొల్లకాపరులు అడ్డుకున్నారు. దాంతో ఇరు గ్రూపులు ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడి చేసుకోవడంతో తీవ్ర ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ భూ వివాదంపై ఇరువురు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

కాగా, సాదా బైనామా మీద కొనుగోలు చేసి 40 ఏళ్లుగా గొర్లు, మేకలను మేపుకుంటున్న గొల్ల కురుమలకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తెలిపారు. అక్రమంగా దొంగ కాగితాలు సృష్టించి ఇప్పుడు భూమి తమదేనని వస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A.No. 1388 / 2019
A.S.No. /2019
వెలగపూడి యేసోబు - పిటిషనర్
Vs
వెలగపూడి కొండయ్య
మరియు వగైరాలు - రెస్పాండెంట్స్
To,
R2. **వెలగపూడి శ్రీను,** తండ్రి **కొండయ్య,**
R3. **వెలగపూడి రమేష్,** తండ్రి **కొండయ్య,**
R2, R3, R/o 11వ లైన్, కుడివైపున 2వ ఇల్లు, కర్మాన్‌గేటు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ స్టేట్.
అయ్యా !

పై నెంబరు పిటిషన్ నందు పిటిషనర్, మీ మీద పిటిషన్‌ను దాఖలు చేసియుండుట వలన మీరు స్వతహాగాగానీ, మీ నుంచి సంపూర్ణముగా సంజాయిషీ పొందిన లాయర్ ద్వారా గానీ సదరు పిటిషన్ ప్రత్యుత్తరములు చెప్పగలందులకు **తే10-04-2023 దిన** వాయిదా వేయబడియున్నది. కావున పై తేదీన **ఉదయం గం॥10.30 నిమిషములకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీని వ్రాతమూలకంగా తెలుపుకొనవలసినదిగా మిమ్ముల్ని ఆదేశించడమైనది. పై తేదీయందు మీరు హాజరు కాకుండా తప్పినయెడల మీ పరోక్షమందు పై పిటిషన్‌ను తీర్మానించెదరు.

వాయిదా : 10-04-2023

(పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
శ్రీ పెన్నా కృష్ణయ్య,
శ్రీ నాదెళ్ళ యల్లమంద రావు
పిటిషనర్ తరపు అడ్వకేట్స్
కందుకూరు - 523105
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

సిపిఎం, సిపిఐ చారిత్రక సమ్మేళనం

- 9న వామపక్షాల కార్యకర్తల సంయుక్త సమావేశం
- ముఖ్య అతిథులుగా ఏచూరి, రాజా, రాఘవులు, నారాయణ
- ప్రెస్‌మీట్‌లో తమ్మినేని, కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ, సిపిఎం రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదో తేదీన చారిత్రక సమ్మేళనం జరగనుందని ఆయా పార్టీల రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం చెప్పారు. హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్ దీనికి వేదిక అవుతుందన్నారు. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, జాతీయ కార్యదర్శి కె నారాయణ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. ఇలాంటి సమావేశం తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇదే తొలిసారి అని అభివర్ణించారు. దీంతో ఇరు పార్టీల మధ్య మరింత ఐక్యత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. ఉద్యమాలు చేస్తూనే సీట్ల విషయంలో ఎలాంటి తేడా లేకుండా రాబోయే ఎన్నికల్లో సిపిఎం, సిపిఐ కలిసే ముందుకు సాగుతాయని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు సర్వశక్తులు ఒడ్డుతామని చెప్పారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపిని ఓడించడం కోసమే బిఆర్ఎస్‌కు మద్దతిచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వంపై అనర్హత వేటు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో సిట్, కేంద్రంలో ఇడి, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థలపై అనుమానాల నేపథ్యంలో టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నాపత్రం లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సిపిఎం, సిపిఐ సంయుక్తంగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశాయి.

చట్టసభల్లో ప్రజావాణి వినిపించడమే మా లక్ష్యం : తమ్మినేని

ప్రజా సమస్యలపై ఐక్య ఉద్యమాలను నిర్మిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. బిజెపికి వ్యతిరేకంగా పనిచేస్తే వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్‌తో సీట్ల సర్దుబాటు కుదుర్చుకునే అవకాశముందన్నారు. లేదంటే ఉభయ కమ్యూనిస్టులు పార్టీలు కలిసే పోటీ చేస్తాయని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో సిపిఎం, సిపిఐ కీలక పాత్ర పోషించాలని, తమ బలాన్ని పెంచుకుంటామని, ఆ దిశగా ముందుకు సాగుతామన్నారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటును ప్రణాళిక ప్రకారమే జరిగిన కుట్రగా అభివర్ణించారు. ఎమ్మెల్సీ కవిత మద్యం కుంభకోణంలో తప్పు చేస్తే ఆమెను విచారించినా, శిక్షించినా తమకు అభ్యంతరం లేదని, అలాంటి చర్యలను సమర్థిస్తామని అన్నారు. అరెస్ట్, విచారణ పేరుతో వేధింపులు, బెదిరింపులకు పాల్పడి ప్రతిపక్షాలను లొంగదీసుకునే చర్యలను తీవ్రంగా ఖండించారు. టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నాపత్రం లీకేజీపై ప్రతిపక్షాలు రాజకీయాలకతీతంగా పోరాటం చేయాలన్న షర్మిల ప్రతిపాదన మంచిదేనని అన్నారు. అదానీ అక్రమాలు, మోడీ అప్రజాస్వామిక విధానాలు ఆమెకు ఎందుకు గుర్తు రావడం లేదని ప్రశ్నించారు.

కేంద్రంలో నయా ఫాసిస్టు ప్రభుత్వం : కూనంనేని

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నయా ఫాసిస్టు విధానాలను అవలంభిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. కులం, మతం, జాతి పేరుతో సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్నదని చెప్పారు. మోడీ తరహాలో గతంలో ఏ ప్రధాని ఈ స్థాయికి దిగజారలేదని అన్నారు. రాహల్ గాంధీ కేసును దారిమళ్లించేందుకే బిసిలను అవమానపర్చడమంటూ మోడీ మాట్లాడారని విమర్శించారు. ప్రధాని విద్యార్హతపై ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుపెడితే సమాధానం ఇవ్వకపోగా రూ.25వేలు జరిమానా విధించడం ఏమిటనీ, ఈ దేశం ఎటు పోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కలిస్తే 40 నుంచి 50 నియోజకవర్గాల్లో గెలిపించే లేదా ఓడించే శక్తి ఉందన్నారు. బిజెపి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పనిచేస్తున్న నేపథ్యంలోనే ఆ పార్టీతో కలిసి పనిచేయాలని నిర్ణయించామని చెప్పారు. సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, పాల్గొన్నారు.

నిరుద్యోగుల కోసం ఏకం కావాలి

- కోదండరాంతో షర్మిల భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నిరుద్యోగుల కోసం అన్ని పార్టీలు ఏకం కావాలని వైఎస్ఆర్‌టిపి అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె నాంపల్లిలోని తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగుల పక్షాన పోరాడటమే టీ-సేవ్ వేదిక లక్ష్యమనీ, ఆ వేదికలోకి అన్ని పార్టీలొస్తే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. టీ-సేవ్ అధ్యక్షునిగా కోదండరాం ఉండాలని కోరినట్టు చెప్పారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఐక్య పోరాటం చేయకపోతే నిరుద్యోగులకు న్యాయం జరగబోదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికి వారు చేసే పోరాటాలను కెసిఆర్ అణచివేస్తున్నారని తెలిపారు. టీ-సేవ్‌లో భాగస్వామ్యం కావాలంటూ షర్మిల కోరినట్టు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. ఆమె ప్రతిపాదనపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. నిరుద్యోగుల పక్షాన ఐక్యపోరాటం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు.

టిడిసి చైర్మన్‌గా శ్రీనివాస్ యాదవ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ -టిఎస్ టిడిసి) చైర్మన్‌గా గెల్లు శ్రీనివాస్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో రెండేండ్లపాటు కొనసాగనున్నారు. చైర్మెన్‌కు కార్యాలయం, వాహనం, సిబ్బంది, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని పర్యాటకశాఖను ఆమె ఆదేశించారు.

బిబా నుంచి ఈద్ కలెక్షన్లు

హైదరాబాద్ : రంజాన్ పండగ వేడుక చేసుకోవడానికి వీలుగా అద్భుతమైన ఎథ్నిక్ శ్రేణీ ఉదుస్తులను అందుబాటులోకి తెచ్చినట్లు వస్త్ర రిటైలర్ 'బిబా' తెలిపింది. తమ స్టోర్లలో తాజా కలెక్షన్‌లో సంప్రదాయ డిజైన్లు, సమకాలీన శైలీ అత్యంత అందంగా మిళితమై ఉంటాయని పేర్కొంది. ఈద్ పండగ వేళ బిబా రెడ్ కాటన్ అనార్కలి కుర్తా చుడీదార్ స్యూట్ సెట్ అత్యద్భుతమైన ఎంపికగా నిలుస్తుందని పేర్కొంది. దీని ధర రూ.6,500గా ఉందని తెలిపింది. వివిధ శ్రేణీ, ధరల్లో అనేక రకాల వస్త్రాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

హైదరాబాద్‌లో తొలి మైక్రో స్కూలింగ్ ఏర్పాటు

డ్రీమ్‌టైమ్ లెర్నింగ్ హబ్ వెల్లడి

హైదరాబాద్ : విద్యా వ్యవస్థలో సరికొత్త విధానాన్ని సృష్టించడం, విభిన్న అభ్యాసన ప్రాంతాలను పెంచడమే లక్ష్యంగా డ్రీమ్ టైమ్ లెర్నింగ్ హైదరాబాద్‌లో తన మొదటి మైక్రో స్కూలింగ్ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం వ్యక్తిగత స్థాయి విద్యా వ్యవస్థను సృష్టించడానికి ఈ హబ్ ఒక అవకాశాన్ని అందిస్తుందని ఆ సంస్థ పేర్కొంది. జూబ్లీహిల్స్‌లో ఈ అత్యాధునిక సాంకేతిక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని డ్రీమ్ టైమ్ లెర్నింగ్ హబ్ సిఇఒ డాక్టర్ కవితా జైన్ తెలిపారు. కొత్తగా ప్రారంభించిన ఈ హబ్‌లో మూడు నుంచి 16 సంవత్సరాల వయస్సు గల విద్యార్థుల అవసరాలను తీర్చనుందన్నారు. కమ్యూనిటీ హబ్, స్టూడియో స్పేస్, డ్రోన్, రోబోటిక్ స్పేస్, లెర్నింగ్ హబ్, ట్రీ హౌస్, తదితర మరెన్నో సౌకర్యాలు ఉన్నాయని కవితా జైన్ పేర్కొన్నారు.

హబ్సిగూడాలో ఆకాశ్ బైజూస్ కేంద్రం ఏర్పాటు

హైదరాబాద్ : నగరంలోని హబ్సిగూడా వద్ద తమ నూతన క్లాస్‌రూమ్ కేంద్రాన్ని ప్రారంభించామని ఆకాష్ బైజూస్ తెలిపింది. హైదరాబాద్‌లో ఇది తమకు తొమ్మిదవ కేంద్రమని పేర్కొంది. ఇక్కడ స్థానిక విద్యార్థులకు ప్రత్యక్ష, హైబ్రిడ్ క్లాస్‌లను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఒక సంవత్సరంలో 1200 మంది నీట్, జెఇఇ, ఒలింపియాడ్‌లలో తగిన శిక్షణ పొందే సౌకర్యాలు ఉన్నాయని తెలిపింది.

ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ నేతలను విడుదల చేయాలి

- రేవంత్ రెడ్డి డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పదవ తరగతి పేపర్ లీకేజ్ నేపథ్యంలో నిరసన తెలిపిన యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నేతలను అరెస్టు చేయడాన్ని టిపిసిసి అధ్యక్షులు, ఎంపి రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన నేతలను తక్షణమే విడుదల చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కెసిఆర్ పాలనను గాలికొదిలేసి రాజకీయ విధ్వంసంలో మునిగి తేలుతున్నారని ఆరోపించారు. టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నాపత్రాల లీకేజ్ విచారణ కొనసాగుతుండగానే పదవ తరగతి ప్రశ్నాపత్రాలు కూడా లీకేజ్ జరగడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని విమర్శించారు. అటు నిరుద్యోగులు, ఇటు విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలుపుతున్న వారిపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయడం దారుణమన్నారు. పదవతరగతి పేపర్లు లీక్ అవుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదన్నారు. లక్షల మంది విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న కెసిఆర్‌కు ఒక్క క్షణం కూడా అధికారంలో కొనసాగే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో పరీక్షలను రద్దు చేయడం కాదనీ, ఇక కెసిఆర్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

దేశ ఎన్నికల ఖర్చు భరించే సొమ్మెక్కడిది?

- కెసిఆర్‌కు పొన్నాల లక్ష్మయ్య ప్రశ్న

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశ ఎన్నికల ఖర్చు భరిస్తానంటూ సిఎం కెసిఆర్ అన్నట్టు తెలిసిందని పిసిసి మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. అంత సొమ్మెక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు కెసిఆర్ ఎక్కడ ఉన్నారని చెప్పారు. ఎన్నికల అఫిడవిట్‌లో కెసిఆర్ ఆస్తుల వివరాలు అందరికీ తెలుసన్నారు. 2014కు ముందు కెసిఆర్‌కు ఫామ్ హౌస్ ఎందుకు లేదని ప్రశ్నించారు. ప్రతిపక్షాల కూటమికి చైర్మెన్‌ను చేస్తే 2024 ఎన్నికలకు ఖర్చు చేసేటంత డబ్బులు ఎక్కడివన్నారు. దేశంలో కెసిఆర్ అంత అవినీతి పరుడు ఎవరూ లేరని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 50శాతం కూడా పూర్తి చేయలేదని సీనియర్ పిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి విమర్శించారు. తొమ్మిదేండ్లుగా నోటిఫికేషన్ ఇవ్వకుండా ఇప్పుడు ఆదరా బాదరాగా నోటిఫికేషన్లు ఇస్తే... పేపర్ లీక్ అయిందని విమర్శించారు.

అంబేద్కర్ దార్శనికత కెసిఆర్‌కు ఆదర్శం

- యుజిసి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ సుఖదేయో థోరట్

ప్రజాశక్తి-కల్చరల్

దళితుల అభ్యున్నతికి సిఎం కెసిఆర్ తీసుకొంటున్న నిర్ణయాలు దేశమంతటికి కర దీపిక కావాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ సుఖదేయో థోరట్ పేర్కొన్నారు. రాజ్యాంగంలో దేశం అంతటికీ ఒకే న్యాయ వ్యవస్థ, ఒకే శాసన వ్యవస్థ, ఒకే పాలనా విధానం పొందు పరచిన అంబేద్కర్ మార్గమే కెసిఆర్ ఆదర్శంగా గ్రహించారని ప్రశంసలు కురిపించారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, సమతా సైనిక్ దళ్, ఎస్‌సి, ఎస్‌టి ఆఫీసర్స్ ఫోరమ్ నిర్వహణలో తెలంగాణ రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ నామకరణం పాటించడంతోపాటు ఆ ప్రాంగణంలో 125 అడుగుల అంబేద్కర్ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపేందుకు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ సుఖదేవ్ పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ జాతీయ నాయకులలో గాంధికి ఉన్న స్థానం ఉందని పేర్కొన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ మోడీ నియంతృత్వ పాలనకు దేశ ప్రజలు చక్ర బంధంలో బందీ లయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు భంగం వాటిల్లిందని ఆయన స్ఫూర్తిని అందుకునేందుకు కెసిఆర్ అంబెద్కర్ పేరు రాష్ట్ర సచివాలయంకు పెట్టటం చరిత్రాత్మక నిర్ణయమన్నారు.

సభలో మాట్లాడుతున్న సుఖదేయో థోరట్

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి మాట్లాడుతూ రాష్ట్ర సచివాలయంకు అంబేద్కర్ పేరుపెట్టి దళిత బహుజన ఆత్మగౌరవం కెసిఆర్ పెంచారని కొనియాడారు. టి సమైక్య రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు, బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్యలు మాట్లాడుతూ కెసిఆర్ దళిత, బడుగు, బలహీన వర్గాల పట్ల సానుభూతి ఉందని, 2003లోనే ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ సమస్యపై సిపిఎం వారితో కలిసి ఉద్యమించారని గుర్తు చేశారు. ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేద్కర్‌కు చిన్న రాష్ట్రాల పట్ల ఉన్న సానుకూలత వల్ల తెలంగాణ రాష్టం సాధ్యమైందన్న భావనతోనే కెసిఆర్ ఆయన భారీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉస్మానియా వర్సిటీ ఉపాధ్యక్షుడు రవీందర్, కాకతీయ వర్సిటీ ఉపాధ్యక్షుడు రమేష్, మహిళ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు విజ్యు లత, రాష్ట్రంలోని ఇతర విశ్వ విద్యాలయాల ఉపాధ్యక్షులు మాట్లాడుతూ కెసిఆర్ రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం దేశానికే ఆదర్శమన్నారు. దళిత బంధు పథకం దేశంలో మరెక్కడా లేదన్నారు. టిఎస్‌పిఎస్‌సి మాజీ చైర్మన్ గంటా చక్రపాణి సిఎంకు ధన్యవాదాలు తెలిపి తీర్మానం ప్రవేశ పెట్టారు. ప్రబుద్ధ భారత్ జాతీయ అధ్యక్షుడు నర్రా రవి కుమార్ అధ్యక్షత వహించిన సభలో ఢిల్లీ వసంత్ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారు.

తెలుగులో కోర్టు తీర్పులు రావాలి

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ గౌరీశంకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు నుంచి హైకోర్టు వరకు తీర్పులు తెలుగులో వెలువడేందుకు హైకోర్టు బార్ అసోసియేషన్ చొరవ తీసుకోవాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ కోరారు. తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా పల్లె నాగేశ్వర్‌రావును మంగళవారం తెలంగాణ సాహిత్య అకాడమీలో జూలూరు గౌరీశంకర్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ ఆయాచితం శ్రీధర్‌లు ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్ మాట్లాడుతూ.. తెలుగులోనే తీర్పులు ఇచ్చే విధంగా చూడాలని సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టీస్ ఎన్వీ రమణ గతంలో కోరినట్టు గుర్తుచేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ... మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు నుంచి జిల్లా కోర్టుల వరకు తీర్పులను తెలుగులో వెలువరించడం సాధ్యమేనని, హైకోర్టు తీర్పులను అనువదించాల్సి ఉంటుందని, ఈ విషయాన్ని చీఫ్ జస్టీస్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, సీనియర్ జర్నలిస్టు గంధం బంగారు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

- గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శ్రీధర్

ప్రజాశక్తి-కల్చరల్

స్వచ్ఛంద కళా సంస్థలు సామాజిక సేవా కార్యక్రమాలలో పాలు పంచు కోవాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ కోరారు. త్యాగరాయ గాన సభ కళలు సాహిత్య కార్యక్రమాలకు సహకరించటంతో పాటు ఉచితంగా పేదల కుటుంబాల వ్యక్తుల వివాహాలకు కళ్యాణమండపంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించి తమ ఉదాత్తత తెలుపుతున్నారని అభినందించారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా దీక్షితులు కళా వేదికపై గాన సభ నిర్వహణలో దీక్షితులు జయంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీధర్ పాల్గొని కళాభిమాని డాక్టర్ కెవి రావును దీక్షితులు పురస్కారంతో సత్కరించి మాట్లాడారు. దీక్షితులు గాన సభకె జీవితం అంకితం చేసారని గుర్తు చేసుకొన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో కథక్ నాట్య గురువు ఆంజి బాబు గాన సభ పాలక మండలి సభ్యుడు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం సంగీత గురువు సంయుక్త శిష్య బృందం త్యాగరాజ, రామ దాసు, అన్నమయ్య కీర్తనలు మధురంగా గానం చేశారు.

జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

- సిఎం కెసిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని.. బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు కొనియాడారు. దళిత సమాజాభివృద్ధికోసం వారు చేసిన సేవలు గొప్పవని తెలిపారు. బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా వారు దేశానికి చేసిన సేవలను సిఎం స్మరించుకున్నారు. దేశ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచివుండే గొప్ప దార్శనికుడని తెలిపారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఉపప్రధాని పదవితో పాటు, పలు మంత్రిత్వ శాఖలు చేపట్టి ఆయా రంగాల్లో తనదైన ముద్రను, దేశ పురోభివృద్ధికి పునాదులు వేసారని గుర్తుచేశారు. అణచివేతకు గురైన దళితులు, వెనుకబడిన తరగతుల ఉన్నతి కోసం, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు, కార్మికోద్యమాలను నడిపారని తెలిపారు. కేంద్ర కార్మికశాఖ మంత్రిగా, వారి సంక్షేమ విధానాలకు బాటలు వేశారన్నారు. ఆయన కార్మిక లోక పక్షపాతి అని సిఎం కీర్తించారు. ప్రజలు ప్రేమగా ఆయన్ను 'బాబూజీ' అని పిలిచేవారని గుర్తుచేశారు. బాబూజీ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం పేదలు, వెనుకబడిన వర్గాలు, గిరిజన, దళిత వర్గాల అభ్యున్నతి కోసం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు.

టెన్త్ జవాబుపత్రాల మాయంపై విచారణ

- ఉట్నూర్ ఘటనపై ఆరా తీసిన ఉన్నతాధికారులు
- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో పదో తరగతి జవాబు పత్రాల మాయంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. ఈ సంఘటన ఎలా జరిగింది..? ఆ జవాబు పత్రాల బండిల్ ఎక్కడ పడిపోయింది..? లోపం ఎక్కడుందో తెలుసుకునేందుకు అధికారులు విచారణ జరుపుతున్నారు. ఉట్నూర్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన కలకలం రేపుతోంది. తప్పిపోయిన బండిల్‌లో ఎందరు విద్యార్థుల జవాబు పత్రాలు ఉన్నాయో తెలియని పరిస్థితి. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ రిజ్వాన్‌భాషా షేక్, జిల్లా విద్యాశాధికారి టి ప్రణీత, పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్‌రావు, డిఎస్‌పి నాగేందర్ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు సైతం ఈ ఘటనపై ఆరా తీసినట్టు తెలిసింది.

ఎవరిది నిర్లక్ష్యం..?

ఈ నెల మూడు నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజున తెలుగు పరీక్ష ముగియగానే.. పరీక్ష కేంద్రంలోని అధికారులు, ఇన్విజిలేటర్లు జవాబుపత్రాలను బండిల్‌గా తయారు చేసి పోస్టాఫీసు ద్వారా అవి చేరుకోవాల్సిన ప్రాంతాలకు చేరవేస్తుంటారు. ఉట్నూర్‌లో సోమవారం విద్యాధికారులు 11 బండిళ్లను చిరునామా రాసి పోస్టల్ శాఖకు అప్పగించారు. అక్కడి సిబ్బంది 11 కట్టలను విభజించి పోస్టాఫీసు నుంచి బస్టాండ్‌కు ఓ ఆటోలో తరలించారు. బస్సులో వేసే క్రమంలో పది బండిల్స్ మాత్రమే ఉండటంతో పోస్టల్ సిబ్బంది మరో బండిల్ కోసం వెతికారు. ఈ విషయాన్ని రాత్రి వరకు గోప్యంగా ఉంచి వెతికినా ప్రయోజనం కనిపించలేదు. పోస్టల్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల జవాబుపత్రాలు మాయం కావడంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఇందులో ఎవరివి ఉన్నాయో తెలియకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదే రోజున వికారాబాద్‌లో ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం రాష్ట్రంలో సంచలనంగా మారగా.. ఉట్నూర్‌లో జవాబుపత్రాలు మాయం కావడం చర్చకు దారితీసింది. కీలకమైన ఈ పత్రాలను రక్షణ లేకుండా ఆటోలో తరలించడం.. మార్గమధ్యలో ఎక్కడ పడిపోయాయో కూడా తెలియని పరిస్థితి ఉండటం విమర్శలకు తావిస్తోంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అటవీరక్షణలో మరణిస్తే పరిహారం

- ప్రభుత్వం ప్రకటన
- అధికారులు, ఉద్యోగ సంఘాల నేతల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

విధి నిర్వహణలో అసాంఘిక శక్తుల దాడుల్లో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది మరణిస్తే అలాంటి వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. అందుకు సంబంధించి సర్కార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో సహా చాలా రాష్ట్రాల్లో అసాంఘిక శక్తుల దాడుల్లో అటవీశాఖ సిబ్బంది మరణిస్తే పరిహారం అందలేదని ఆయా సంఘాల నేతలు పేర్కొన్నారు. తొలిసారి ఇలాంటి విధాన పరమైన నిర్ణయం ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, చీఫ్ సెక్రటరీ శాంతికుమారిలకు అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పిసిసిఎఫ్,హెచ్ఒఎఫ్ఎఫ్) ఆర్ఎం. డోబ్రియాల్‌తోపాటు ఐఎఫ్ఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్, స్టేట్ ఫారెస్ట్ సర్వీస్ అసోసియేషన్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్, వివిధ అటవీ శాఖ ఉద్యోగ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణకు హరితహారం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని ప్రకటించారు.

చిన్నారితో సహా తల్లిదండ్రుల ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూడు నెలల చిన్నారికి ఉరేసి, అనంతరం తల్లిదండ్రులూ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దేవరంపల్లి గ్రామానికి చెందిన నర్సింలు, లక్ష్మీ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొడుకులు అశోక్ (25), రఘువేందర్ ఇద్దరూ వ్యవసాయం చేస్తూ.. ఆటో కొనుగోలు చేసి గ్రామంలోని కూరగాయలను నగరంలోని మార్కెట్‌కు తరలించడం, కిరాయికి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. రెండేండ్ల కిందట అశోక్ ఆలూరు గ్రామానికి చెందిన అంకిత (21)ను ప్రేమించి పెద్దలను ఒప్పించి పెండ్లి చేసుకున్నారు. వారికి మూడు నెలల కిందట పాప పుట్టింది. అప్పటి నుంచి అంకిత పుట్టింటిలోనే ఉంది. ఇటీవల అశోక్ చెల్లి వివాహం నిశ్చయమయింది. శుక్రవారం నిశ్చితార్థం ఉండటంతో అంకిత పాపను తీసుకొని గురువారం దేవరపల్లికి వచ్చింది. కాగా, సోమవారం ఎప్పటి మాదిరిగానే అన్నదమ్ములు అశోక్, రఘువేందర్ గ్రామంలోని రైతులు సాగు చేసిన కూరగాయలను ఆటోలో వేసుకొని నగరంలోని మార్కెట్‌కు తీసుకెళ్లి తిరిగి తెల్లవారుజామున 4గంటలకు ఇంటికి వచ్చారు. ఆ తర్వాత అశోక్, అంకిత ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. మొదట చిన్నారిని దూలానికి ఉరేసి, ఆ తర్వాత వారిద్దరూ ఉరేసుకున్నారు. ఉదయం ఆరు గంటల సమయంలో టీవీ సౌండ్ ఎక్కువగా వస్తుండటంతో పక్కింటి వాళ్లు గమనించి తులుపులు కొట్టారు. ఎంతసేపు కొట్టినా ఎవరూ బయటకు రాకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా.. అంకిత, మూడు నెలల చిన్నారి అప్పటికే మృతి చెందారు. అశోక్ కొన ఊపిరితో ఉండగా.. తాడువిప్పి కిందికి దించి చూడగా.. అతనూ మృతిచెందాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు పాల్పడటానికి గల కారణాలు తెలియరాలేదు.

కేంద్ర విధానాలపై సమర శంఖం

- ఢిల్లీ ధర్నాకు రాష్ట్రం నుంచి వేలాదిగా తరలిన కార్మికవర్గం

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో జరగనున్న ధర్నాకు తెలంగాణ రాష్ట్రం నుంచి వేలాది మంది కార్మికులు తరలివెళ్లారని సిఐటియు రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగుభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంఘాల ఆధ్వర్యంలో మూడు నెలలపాటు పెద్దఎత్తున క్యాంపెయిన్ జరిగిందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేటికరణ విధానాల వల్ల రాష్ట్రంలోని సింగరేణి, ఎన్‌టిపిసి, ఆర్ఎఫ్‌సీఎల్, పెట్రోలియం, రైల్వే, ఇన్సూరెన్స్, ప్రభుత్వరంగ బ్యాంకులు, హైవేలు, ప్రజల సంపదకు ప్రమాదం ఏర్పడిన అంశాలను విస్తృతంగా క్యాంపెయిన్ చేసినట్టు వివరించారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లు, విద్యుత్ సవరణ చట్టం-2022, విద్యావిధానం, ఎంవీయాక్టు-2019, తదితర నిర్ణయాలు కార్మికహక్కులను హరిస్తున్నాయని అన్నారు. వీటన్నింటికి వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగే ధర్నాలో 10లక్షల మంది పాల్గొనున్నారని, తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి కార్మికులు, ఉద్యోగులు భారీ సంఖ్యలో బయలుదేరినట్టు చెప్పారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఆఫీస్ బేరర్స్ భూపాల్, జె.వెంకటేష్, ఎస్వీ.రమ, పి.జయలక్ష్మి, వంగూరు రాములు, పద్మశ్రీ, కె.ఈశ్వర్‌రావు, ఉన్నారు.